[సింహ. గడ్డం చేసుకోవడం పూర్తి అవుతుంది. ముఖం కడుక్కొ వొస్తాడు. ఉత్తర సిగిరెట్టు యిస్తుంది. సింహబలుడు అంటిస్తాడు.]

సింహ:—అక్కా నా వొళ్లు పట్టుకుచూడు...ఎల్లా ఉందో—శీత పైత్య జ్వరంలాగు!

సుదేష్ణ:—అప్రదిష్ట...అప్రదిష్ట.

సింహ:...ఉత్తరా టీ తీసుకు రమ్మను.

(ఉత్తర వెళ్ళిపోబోతుంటే—కీచకుడు ఆమెకు కన్ను కొడతాడు. ఆమె మొహం చిట్లించుకు వెళ్లిపోతుంది.)

సింహ:—(టీ తాగుతూ) అక్కయ్యా—రాత్రి పది దాటిం తరువాత టీ కాచమను. టీ డస్టు తీసిదాచెయ్యి. ఆ వెనక టీ డస్టుకోసం సైరంధ్రిని మా యింటికి పంపు ...లేకపోతే నేను బ్రతుకను.

సుదేష్ణ:—జలగలా పట్టుకున్నావేమిరా? అల్లాగేలే వెళ్లు.

సింహ:—అల్లాగేలే అంటేకాదు. ఏమరు చూస్తూ ఉంటాను.

సుదేష్ణ:—సరేలే!

సింహ:—అక్కయ్య అన్నమాట తప్పను.

సుదేష్ణ:—నాక ప్రదిష్ట తీసుకురాకు.

సింహ:—చెప్పిపెట్టిన బుద్ధి ఎంతసేపూ?

(అంతా వెళ్లిపోతో)

వర్షం కురుస్తుంది. ఆవర్షం. అల్లా—యిల్లా—భేషుగ్గా—సొగసుగా—అందంగా—ఉన్నది.

## మూడో రంగం. రాత్రి పదిగంటల తరువాత.

[ద్రౌపది తుళ్లలేక గజగమనంతో వెళుతూంటుంది. కీచకుడు ఏమీ తోచక అటూ యిటూ వరండాలో పచారు చేస్తుంటాడు. వాకిట్లో పారావాళ్లు ఉండరు. దూరంనుంచీ ద్రౌపదినిచూచి యింట్లోకి పోయి పెద్ద బాలశిక్షా—కవిచౌడప్ప శతకం తీసుకుని చదువు తూంటాడు.]

ద్రౌపది:—(ప్రవేశించి) సింహబల మహారాజా!

సింహ:—"..............."

ద్రౌపది:—కీచక మహారాజా!

సింహ:—ఎవరు వారు?

ద్రౌపది:—నేనండీ సైరంధ్రిని. సుదేష్ణ పంపితే వొచ్చాను.

సింహ:—ఓహో—మీరా? దయచేయండి. లోపల చదువుకొంటున్నాను.

ద్రౌపది:—తమ రిప్పుడు పఠించే గ్రంథం ఏమిటండీ?

సింహ:—పెద్దబాలశిక్ష.

ద్రౌపది:—అల్లాగాండి.

సింహ:—మా అక్క మిమ్మల్ని పంపిందా?

ద్రౌపది:—అవును. టీ డస్టుకోసం.

సింహ:—"రావే నీ కవుగింట నన్ను ముమలే—"

ద్రౌపది:—తమరు టీ సేవించారా?

సింహ:—నీకు కావలెనా? ఓ లక్షకప్పులు యిప్పిస్తాను.

ద్రౌపది:—నా కక్షిల్లేను తమరు కులాసాగా పొందుకొంటూంటే—తాగేరేమో అనుకొన్నాను.

సింహ:—పోనీ—నువ్వుకూడా తాగరాదూ?

ద్రౌపది:—అక్కల్లేదండి.

సింహ:—అబ్బే—మీరుకూడా తాగి నన్ను ధన్యుణ్ణి చేయరాదూ? ఇదుగో ప్రేమదాసుడు.

ద్రౌపది:—టీ డస్టు యిప్పించండి—మీ అక్కగారు టీకోసం బాధపడుతూంటారు.

సింహ.—(వెకిలి నవ్వునవ్వి) మరేమీ అక్కకు బాధ ఉండదు లెండి.

ద్రౌపది:—కాదు తలకాయ నొప్పిగా ఉందామెకు.

సింహ:—అదంతా ఉట్టిది—నాకోసమే మిమల్ని పంపారు. (అని ముందుకొస్తాడు.)

ద్రౌపది:—(వైతొలగి) మర్వారోద్యమబాహు విక్రమ రసాస్తోక -

సింహ:—ఆగూ — నాకూవొచ్చు ఆపద్యం — ఘరవాలా! "నీచను గొండలగ్రుమ్మి—."

ద్రౌపది:—(ఇరికేసై) నలిపివేయాలా?

సింహ:—ఆఁ ఆది.